మారిన మనిషి

శ్రీ పిళ్లా సుబ్బారావుశాస్త్రి

సుబ్బారావుకి వుద్యోగం యెక్కడా దొరకలేదు. చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేశాడు, కాని లాభం లేకపోయింది. చివరికి గుమాస్తా ఉద్యోగంకూడా దొరకలేదు.

తిరిగి మూలపడేసిన వీణతీసి, దుమ్ముతుడిచి ప్రయివేట్లు చెప్పడానికు బయలుదేరాడు. చిన్నప్పుడు నేర్చుకున్నాడు సంగీతం!...అదేపనికొచ్చిందిప్పుడు! ... సుబ్బారావు సంగీతంకూడా బాగా నేర్చుకున్నాడు.

శేఖరంగారమ్మాయి పద్మావతి. పద్మ మంచి యోగ్యురాలు, విద్యార్థిని! ... పద్మకి సుబ్బారావు ప్రయివేటు చెబుతూవుండేవాడు. - పద్మ హృదయం చాల మృదువయినది. అందులోకీ స్త్రీ! ... ఆమె సుబ్బారావు దుస్థితిచూసి జాలిపడేది. ఆయనకి చాలా సహాయం చేస్తూవుండేది! ...

సుబ్బారావు ప్రయివేటు చెప్పేందుకువచ్చాడు. పద్మ చాపకోసం వెదికింది; కనిపించలేదు! ... "ఏమండీ! మీరలా కుర్చీలో కూర్చోండి; నేక్రింద కూర్చుంటా"నన్నది పద్మ. సుబ్బారావు 'సరే'నని కుర్చీలో కూర్చున్నాడు.

పాఠం అయిన తర్వాత గభాలునలేచాడు సుబ్బారావు ... "ఫర్ ..." మన్నాది పాంట్ ... అసలే పాతది, కొయ్యకుతగిలి చినిగిపోయింది. సుబ్బారావుకు చాలా సిగ్గేసింది! ఎలా వెళ్ళడం?... పట్టపగలు ... మిట్టమధ్యాహ్నం మాత్రంగాదు!...

"ఉండండి! ..." అన్నాది పద్మ. సుబ్బారావుకు భయంవేసింది. ఈ ఫంట్లాంతో బయటకెలా వెళ్ళడం? ... ఏంచెయ్యడం? ఎలా వెళ్ళడం?... ఇంతలో పద్మవచ్చి "ఇదిగో, తీసుకోండి!" అన్నాది, ఒక పంచయిస్తూ.

"అబ్బే! వద్దులెండి! ... ఇంటికివెళ్ళి మార్చుకుంటాను" అన్నాడు సుబ్బారావు. అన్నాడేగాని యింటిదగ్గర పెట్టెలో, తయారుగా వున్నాయా? చాకలాడి దగ్గర అద్దకు తీసుకోవాలి! ... "ఫర్వాలేదు; తీసుకోండి" అని చేతికిచ్చింది భయపడ్తూ పద్మ.

"అలా, వెళ్ళి నా గదిలో మార్చుకోండి! ..." అన్నాది డ్రస్సింగ్ రూమ్ చూపిస్తూ. సుబ్బారావు పాంటువిప్పి, పంచ కట్టుకున్నాడు.

"అదిలా, యివ్వండి! ... కుట్టి యిస్తాను" అన్నాది పద్మ. - అతికష్టంమీద తన పాంటు ఆమెకిచ్చాడు. - ఆ రోజు పద్మావతి పంచయివ్వకుంటే, అతనిలా తలెత్తుకు యీ వూళ్ళో తిరిగేవాడా?

ఆగష్టు పదిహేను! ... స్వాతంత్ర్య దినోత్సవం! ... వూళ్ళో త్రివర్ణపతాకాలు ఎగురుతున్నాయి. - పద్మావతి ఏదో తియ్యనికలలు కంటోంది! ...

"ఏమేఁ ... అచ్చీ! అయితే సంగీతం మాష్టార్కి పెళ్లిఅయిందా?" అని అడిగింది పద్మ పనిమనిషి అచ్చిని.

"అబ్బే ... యింకా అవలేదమ్మా! ... అతనికే లేదూ, తింటానికి తిండి ... పెళ్ళికూడానా?" అన్నాది అచ్చి.

"నీకు తెలీదులేవే! ... అయ్యేవుంటుంది" అన్నాది పద్మ. పద్మకి యింకా అనుమానమే! ... ఇంతకీ సుబ్బారావుకి పెళ్ళి అయిందా? లేదా? ఎలా తెల్సుకోవడం? ...

సుబ్బారావు పాఠంచెప్పడం పూర్తికాగానే లేచాడు. "ఈ గౌను, మీ అమ్మాయికివ్వండి! ..." అన్నాది పద్మ.

"అమ్మాయా? ..."

"అవును! ... అమ్మాయికివ్వండి! ... ఏం? మీకు పిల్లలులేరా? ..."

"పిల్లలూ! ... ఇంకా పెళ్ళికానిదే ..." అన్నాడు సుబ్బారావు. పద్మ ఫకాలున నవ్వింది. అతనూ నవ్వేడు.

సుబ్బారావు ఒక రోజు ప్రొద్దున్నే వచ్చాడు. "ఏమోయ్! ... ఇలా వచ్చావ్?" అని ఆడిగారు వార్తాపత్రిక ముఖంమీదనుంచి క్రిందకుదింపి.

"ఏంలేదండీ! ..." నసిగాడు సుబ్బారావు.

"చెప్పవోయ్ ... నా దగ్గర సిగ్గుదేనికీ?" — చుట్ట చప్పరించారు శేఖరంగారు.

"... ..."

"ఊఁ ... మాటాడవోయ్ ...!"

"... నాకో ... చిన్న సహాయం ..."

"ఏమిటో, ఆ సహాయంచెప్పూ! ... చేతనయితే చేస్తాను."

"అఱవై రూపాయలు కావాలండీ!" అన్నాడు భయపడ్తూ, నొక్కుతూ, నక్కుతూ సుబ్బారావు.

"అఱవైరూపాయిలు! ... Impossible ...! ఇప్పుడు దొరకడం కష్టం!" అన్నాడతను.

"మీరులేదంటే యెలాగండీ? ... మీ రిచ్చిన అరవయి రూపాయిలూ ఆఫీసర్కుకడితే, నూట యాభై రూపాయలమీద వుద్యోగం దొరుకుతుంది! ... అమ్మాయిగారికి ప్రయివేటుచెప్పో, లేక మొదటి జీతం తీసుకునో, యిచ్చేస్తాను" అన్నాడు సుబ్బారావు గుక్కత్రిప్పుకోకుండా! ...

"అవునయ్యా! నువ్వు ఎగవేస్తావనిగాదు. నా దగ్గరలేదుకదా!" అన్నారు శేఖరంగారు. ప్రక్కగదిలో తలుపుచాటున నుంచొని వింటోంది పద్మ.

సుబ్బారావు ఆశ నిరాశ అయింది. ఆ వుద్యోగం తనకి దొరకడంకల్ల! ... సాయంత్రం ప్రయివేటుకు బయలుదేరాడు.

ప్రయివేటు పూర్తి అయిన తర్వాత, "ఉండండి! ... వస్తాను" అని చెప్పి క్రిందకు వెళ్ళింది. శేఖరంగారు ఎక్కడికో బయలుదేరారు.

"నాన్నా! ..."

"ఏమమ్మా ... పద్మా? ..."

"నాకో అరవై రూపాయలు కావాలి నాన్నా!"

... అంది బుంగమూతిపెట్టి పద్మ.

"దేనికీ?"

"పిక్నిక్‌కి వెళ్ళాలి! ... అందుకు ..." అన్నాది పద్మ క్షణం ఆలోచించి.

"అరవయి రూపాయలూ తీసుకోగాని ... పిక్నిక్‌కి మాత్రం వెళ్ళకు ... - రామనాథంగారబ్బాయి, పిక్నిక్‌కి వెళ్ళి చచ్చిపోయాడు సముద్రస్నానంచేస్తూ ..." అంటూ అరువదికాగితాలు తీసి పద్మ చేతిలో పెట్టాడతను.

"సరే"నని మేడమీదకు తుర్రుమన్నాది పద్మ. - "తీసుకోండి...!" అంటూ పదికాగితాలు, ఆయనచేతిలో పెట్టింది.

"దేనికీ? ..."

"ప్రొద్దున్న నాన్న నడిగేరుగా ...!"

"ఆయనిచ్చేరా? ..."

"ఊఁ... హుఁ... నేనేయిచ్చాను !... ఆయనతో అనకండి!" అన్నాది పద్మ. - సుబ్బారావు క్రింది తండ్రీ కూతుళ్ల సంభాషణవిన్నాడు... కాని అడిగేడు ఊరికే ... !

సుబ్బారావు అరవయిరూపాయలూ ఆఫీసర్‌కు లంచంకట్టేడు ! ... ఉద్యోగందొరికింది. జీతం నూట యాభైరూపాయలు ! ...

"పద్మయెంతమంచిది ... ? నేనంటే పద్మకి ఎందుకంత ప్రేమ ... ? ! నన్ను ప్రేమిస్తోంది ... ! పద్మ తండ్రి, పద్మా ఒప్పుకుంటే పద్మకి దాసుణ్ని అయిపోతాను ! ... ... పద్మనే వివాహంచేసు కుంటాను ! అలాగయినా, ఆమెబుణం తీర్చు కుంటాను ... ఆమె తిరిగి అరవైరూపాయలూ యిస్తే వద్దన్నాది ... ! ఎంత ప్రేమ ... ?" అను కున్నాడు సుబ్బారావు.

అబ్బ ... బ్బ...! ఎంతగామారిపోయాడు... ? అసలు సుబ్బారావేనా ... ? ఆఁ ... వాడే ... ! పద్మని పెళ్ళిచేసుకోనన్నాడు ... ! నిజం ... ! అఖ్ఖర్లేదన్నాడు ... !!!

పద్మ సుబ్బారావుని ఎంతగానో ప్రేమించింది... ! అంతేకాదు, అతనికి సహాయంచేసింది ... ! ఆ వుద్యోగం యిప్పించింది పద్మే ... !

శేఖరంగారు అడిగేరు సుబ్బారావుని, పద్మని పెళ్ళిచేసుకోమని .... మొదట 'సరే' అన్నాడు. తర్వాత 'అఖ్ఖర్లేదు' అన్నాడు.

అవును...! డబ్బు... ఎంతపనయినాచేస్తుంది...! మానవుడికి కావల్సింది డబ్బు ... ! డబ్బులేనిదే జీవించలేడు ! ... వాడి ప్రాణాలుతీసేది డబ్బు ! ! పచ్చని సంసారాల్నికూల్చేది డబ్బు ... !! అంతా డబ్బు మహిమ ...

సుబ్బారావు గొప్పింటిపిల్ల 'దేవి'ని చేసు కున్నాడు. ఎక్కువకట్నం యిచ్చారు ... ! హాయిగా పెళ్ళిచేసుకున్నాడు.

పెళ్ళికి పద్మని పిలవలేదు ! ... ఛీ ! ... నీచుడు ... వాడికోసమే పద్మ తపించిపోయింది ! ...

పద్మ చాలా చిక్కిపోయింది ! ... ముఖం కళా విహీనం అయిపోయింది ! ... సంస్కారంలేనిజుట్టు, మాసిపోయిన బట్టలూ ... ఆమే నాకీ కథ ... గాథ ... చెప్పింది ...

"ఈ కథ మీరు రాస్తారా ?" క్షీణంగా అడి గిందామె. "అవును !" అన్నాను.

"ఎలా రాస్తారూ ?"

"ఇలాగే ..." అన్నాను.

"ముగింపు ఎలా చేస్తారూ ? ..."

"ఇలానే ! ..." అన్నాను. ఆమె కొంచెం సేపు, కొన్ని క్షణాలు ఆలోచించింది.

"అలా ముగించకండి ! ..." అన్నాది.

"ఏం ? ..." అన్నాను.

"బావుండదు ... ముగింపు నేచెబుతాను..." అన్నాది.

"చెప్పండి ! ..."

"ఇప్పుడు ... కాదు ... శ్రమ అనుకోకుండా రేపు మా యింటికిరండి ! ..." అన్నాది. 'సరే' అన్నాను.

మర్నాడు ఉదయం వాళ్ల యింటికి వెళ్ళాను. ఇంటిముందు జనం మూగివున్నారు. మధ్య మధ్య ఎర్రటోపీలుకూడా మెరుస్తున్నాయి ! ...

"చూశావా... ఎలాచేసిందో ! ..." అన్నారు శేఖరంగారు. - పద్మ యిలా చేస్తుందని నేను అనుకో లేదు ! ...

పద్మ స్లీపింగ్‌టాబిలెట్స్ వేసుకొని చచ్చి పోయింది ! ... ఆత్మహత్య ! ... కాదు సుబ్బా రావు పద్మని హత్య గావించేడు.

"నా చావుతో ఎవరికీ సంబంధంలేదు. ఎవరూ నా చావుకి విచారించనక్కర్లేదు ! ... " అని చక్కగా రాసింది వుత్తరం ! ...

ఆమె డైరీలో మాత్రం, రాత్రి రాసినట్టుగావుంది ... "మగవాణ్ణి నమ్మకూడదు ... వాడి ప్రేమ వట్టి నటన ..." అని రాసివుంది ! ... పాపం ! ఆమె యెంత కష్టపడిందో ! ...

ఆమె నన్ను యిలా ముగించమని చెప్పడానికే రమ్మన్నాది వాళ్ళ యింటికి గామోసు ! ...

"టక్ ..." _ నాపాళీ చిట్లిపోయింది ...

——X——

అంకెలా - సంఖ్యలా

శ్రీ క్రొవ్విడి అన్నంరాజుశర్మ

(గత సంచిక తరువాయి)

"ఆ తర్వాత... ...యీ పాషాణ మనస్కుడ్ని కూడా కరిగించివేయగల, పీల్చి పిప్పచేయగల సంఘటన ఒకటి జరిగింది. ఇందాక పదిసంవత్సరాలక్రితం జరిగిందన్నదదే. అదే నా యిప్పటి పరిణామానికి, వైఖరికి మూలాధారం. చాలా నెలలు గడిచాక ఓరాత్రి నేను పన్నెండు గంటలకు తిరిగివచ్చి మంచి నిద్రలోవున్నాను. క్రింద పెరట్లోంచి దభీలుమని చప్పుడు వినిపించి, ఉలిక్కిపడిలేచాను. ఆ గడబిడలో నేను సంశయిస్తూండగానే గంగమ్మ క్రిందనుంచి ఎలుగెత్తి ఏడుస్తూ కేకలువేయడం వినిపించింది. దీపాలన్నీ వెలిగించుకుంటూ క్రిందకు పరిగెత్తాను రొప్పుతూ. బావిదగ్గర నిలబడి ఆవిడ గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. అరవింద బావిలో దూకేసిందని చెబుతోంది. నేను గబగబ కేకలువేసేసరికి నౌఖర్లంతా పరిగెత్తుకువస్తున్నారు. హఠాత్తుగా నాలో ఏదో సంచలనం చెలరేగింది. అది యిటువంటిది అని చెప్పలేను. కాని ఆ బాధ భరించటం ఎటువంటి మానవునికైనా దుస్సాధ్యము. టార్చిలైటు బావిలోకి వెలిగించి 'అరవిందమ్మతల్లీ!' అని వెర్రిగా అరిచాను. నీటి అడుగున ఏదో కదులుతున్నట్లూ, కొట్టుకుంటున్నట్లూ అలజడివల్ల తెలుస్తోంది. నేను ఉద్రేకాన్ని భరించలేకపోయాను. లోపలకు దూకివేద్దామని సంకల్పించాను. నా ఉద్దేశం గ్రహించి ఎవరో గట్టిగా పట్టుకుని ఆపుతున్నారు. వొణికిపోతూ అలా నీళ్ళలోకీ, ఆ చిన్న వెలుగులోకి చూస్తున్నాను. ఎవరేం చేస్తున్నదీ తెలియదు. ఎవరి రోదన వినిపించటం మానివేసింది. అలా రెప్పవాల్చకుండా చూస్తున్నాను. నీటిలో అలజడి తగ్గింది. క్రమక్రమంగా ప్రశాంతత ఆవరించి నిర్మలంగా వున్నాయి. నా చేతిలో దీపం చివరి వెలుగు వెలిగి ఆరిపోయింది. 'అరవిందా!' అని ఉన్మత్తునిలా అరిచి వెనక్కి వాలిపోయాను.

"తెలివివచ్చేసరికి ఎదురుగుండా పిచ్చితల్లి మృతకళేబరం. నేను చేసినతప్పు యీ శవంరూపంలో కళ్ళముందు మెదుల్తోంది. నిస్పృహతో 'అరవిందా, నన్ను క్షమించవూ?' అని నేలమీదపడి విలపిస్తూంటే, 'దౌర్భాగ్యుడా! ఇదంతా నువ్వే చేశావు' అంటూన్న గంగమ్మ చెల్లి దూషణవాక్యాలు ములుకుల్లా బాధిస్తూ అస్థిమితుడ్ని చేసివైచాయి. ఆ రోజు ఎందుకంత ఏడ్చానో తెలియదు."

ధారావాహికంగా ప్రవహిస్తూన్న ఆ నేత్రాంచలాలను మూతపడకుండా బిగపడ్తూ "అప్పటినుంచి నాలో ... చచ్చిపోయింది. బ్రతకటం ఆరంభించాను. అనుక్షణం నన్ను ఏదో వేదన తొలిచివేయసాగింది. ఇదివరలో లోక క్షేమానికి వినియోగపడే ఏ వుద్యమానికీ నేను ఆదుకోనడం జరగలేదు. ఎవరైనా ఏదైనా సహాయంకోసం నన్నర్థిస్తే కసిరిగొట్టేవాడిని. నేను పిసినిగొట్టునుకాను. కాని లోకహిత కార్యక్రమం నాకు కంటగింపుగా వుండేది. చిట్టితల్లి ఆదుర్భర జీవితం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినప్పటినుంచీ నా నైజం పూర్తిగా మారిపోయింది. భగవంతుడు నాకు కావలసినంత డబ్బిచ్చాడు. ప్రజోపకారంకోసం వుపయోగించకపోతే తగలపెట్టనా అది? ఈ నా పరివర్తనకు కారణం అరవింద. అందుచేత అరవిందలాంటి వ్యక్తుల్ని చూస్తే నా కన్నీళ్లూ, సానుభూతీ కట్టలు

తెగి ప్రవహించేవి. ... ఓ రోజు రాత్రి మనశ్శాంతి కోసం నదివొడ్డుకు వెళ్ళి తిరుగుతున్నాను. నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నేను తప్ప ఆ సమయంలో, ఆ నిశీధినిలో ఎవరూ లేరనుకుంటున్నంతలోనే ఎవరిదో ఆకారం వడివడిగా, గజిబిజిగా పరిగెడుతూండటం లీలగా విలోకించి తృళ్ళిపడ్డాను. మారు ఆలోచనలేకుండా బిగ్గరగా అరుస్తూ నదికి అభిముఖంగా నేనూ పరిగెత్తడం ప్రారంభించాను. నేనా? ముసలివాడ్నే కదా! ఆఖరికి ఎలానో వగరుస్తూ వగరుస్తూ ఆ వ్యక్తిని పట్టుకున్నాక, స్త్రీ అని గుర్తించాక, నా దురవస్థ నేంచెప్పను? ప్రపంచంలో నాకంటే ఎవరూ అట్టి స్థితిలోవున్న స్త్రీ యొక్క మనోవేదన గుర్తించలేరన్న సంకుచితాభిప్రాయం కలిగింది. ఆమెను ఊరడించి యింటికి తీసుకువచ్చాను. అప్పటికి పదిహేడేళ్ళయినా నిండని ముగ్ధ. ఇంచుమించు నా కుమార్తె వయస్సే. తన కథ వినిపించింది. రూపంలోనేకాక స్వానుభవంలోకూడా అరవిందతో పోలికలే. ఈ చిట్టి తల్లిని నా కడుపులోపెట్టి కాపాడాలనుకున్నాను. ఆమే కమల. ఇదీ నాలుగు సంవత్సరాల క్రిందటి సంఘటన.

రాజయ్యగారు చెప్పుకుపోవటం ఆపాడు. ఒకసారి కమలవంక ఆప్యాయంగా చూచాడు. ఇద్దరివీ ఆర్ద్రహృదయాలే అయినట్లయితే ఆ వారధిని విరగగొట్టగల సమర్థుడెవడు?

"ఇంతే నేను చెప్పగలిగింది. ప్రతివాడూ దేశోద్ధరణ, దేశోద్ధరణ అంటూ పాటుపడాలని నేను చెప్పను. పీడించి, బెదిరించి ఎప్పుడూ ఎవరినన్నూ లొంగదీసుకోవటం అవివేకం. ఏదో ఓ ఘట్టంతో, ఘటనతో చాంచల్యం వదిలిపోవాలి. మానసిక విప్లవంరావాలి. దీనికి సమర్థత తోడు కావాలి. ప్రతి ఒక్కడి జీవితంలోనూ యీ విప్లవం ఎప్పుడో ఒకప్పుడు తటస్థించటం తథ్యం. అది నిలబెట్టుకోవట మసాధ్యమని చింతించటం మానినప్పుడు శ్రేయస్సు అవతరిస్తుంది.

మరి ఒక్క విషయంచెప్పి ముగిస్తాను. అనాథలంటే నాకు ఆపేక్ష. కాని పతితులంటే, భ్రష్టులంటే నాకు సానుభూతిలేదు. అసహ్యంకూడా. తాను పతితఅయినందుకు ఏవో కుంటికారణాలు చెప్పేవ్యక్తి సన్నిహితత్వాన్ని నేను భరించలేను. ఇది నా స్వాభిప్రాయం. నైర్మల్యం నశించాక జీవితంలో ఆదర్శానికి అర్థంలేదు. నాది ఆదర్శం కాదు, ఆరాటం. ఇంతే."

చాలా గంభీరమైన దశలో సభ ముగిసింది. అందరూ లేచి, సెలవు పుచ్చుకునేవాళ్లు సెలవు పుచ్చుకుని వెళ్ళిపోవటానికి ఉద్యుక్తులౌతున్నారు. కమల తండ్రివద్దకువచ్చి నిలబడింది. అంతలో ఒక వ్యక్తి వచ్చి రాజయ్యగారితో యిలా అన్నాడు. "మీతో నేనింతవరకూ మాట్లాడటం తటస్థించలేదు. ఇవేళ నాకెంతో ఆనందంగావుంది. మీరు సమ్మతిస్తే ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నాను."

ఆ వ్యక్తికి నలభయిఏళ్ళు దాటాయి. బాగా సంస్కారంవున్న మనిషిలా గోచరిస్తున్నాడు. జీవితంలో బాగా అనుభవంవున్నవాడిలా వున్నాడు.

రాజయ్యగారు సవినయంగానవ్వి "అవశ్యం అడగండి" అన్నాడు.

"మీ చివరి వాక్యాలు నన్ను చాలా కలవరపరిచాయి. పతితజనోద్ధరణలో మీకు సద్భావంలేదనిపించింది."

"సారాంశం మనవిచేశాను. అది నా వ్యక్తిగత అభిప్రాయం. మానవుని శీలంలోవున్న విలువయందు నాకు విశ్వాసం పెరిగింది."

"వాస్తవమే. మీరు వారిపట్ల అంత ఏహ్యభావం ప్రదర్శించడం సమంజసంకాదేమో. వితంతు వివాహాలను మీరు ఆమోదిస్తారుకదా. మీరు అన్న పతితకు ఆ స్వరూపం యిచ్చింది యీ వివాహాలను అభ్యంతరము కలిగించటమే కొంతవరకూనని ఒప్పుకుంటారా?"

"కావచ్చు. నేను అవినీతిని భరించలేను."

ఆ వ్యక్తి నీరసంగానవ్వి "ఇంత నిండు సభలో మీ స్వరూపాన్ని మీరు అంత వివరంగా వెల్లడించుకోవటంలోగల సాహసాన్ని అభినందించక తప్పదు." అని యింకోమాట తప్పిస్తూ "ఈమేకదూ మీ కమల. పునర్వివాహం చేశారా?" అని అడిగాడు. ఈ మాటలువిని కమల తటాలున ముఖం ప్రక్కకు త్రిప్పుకోవటమే కాక, ఆ సంభాషణ నాలకించటంలో ఏమీ ఆసక్తి కనపర్చలేదు.

"మన దేశంలో ఎటువంటి మనుష్యులున్నారంటే?" అన్నాడు రాజయ్యగారు. "ఆశయానికీ, స్వలాభానికీ ముడిపెడతారు. కాలం పురోగమిస్తోంది. అనేక నవీన సాంప్రదాయాలు అవతరిస్తున్నాయి. అయినా ఎప్పటికప్పుడు అన్నీ సరిక్రొత్త. పదిమందిచేసిన ఒక కార్యం పదకొండోవాడికి యింకా నూతనంగానే, అబ్బురంగానే కనబడుతుంది. ఈ దురసంశయం నశించాలంటే మానసికంగా వ్యక్తులు పరివర్తనచెందిపోవాలి. దీనినే మానసిక విప్లవం అంటాను నేను. అది యిప్పుడప్పుడే జరిగేపనికాదు. కమలపెళ్ళి...తగిన వరుడు దొరికినప్పుడు తప్పకుండా జరుగుతుంది."

ఆ వ్యక్తి సెలవుతీసుకుని వెళ్ళిపోయాడు. రాజయ్యగారు కమలకేసి చిరునవ్వుతో చూసి "కమలా నీకు కోపం తెప్పించానా?" అన్నాడు.

కమల యిటు తిరిగి "ఔనండీ నాన్నా. మీరు ఎన్ని రహస్యాలు యిన్నాళ్ళూనాకు చెప్పకుండా దాచుకున్నారో. రండి. అక్కయ్యను దగ్గరగా పరిశీలిద్దాం?"

రాజయ్యగారు కొద్దిగా చలించి "సరేపద" అన్నాడు బరువుగా నిట్టూర్చి. వాళ్ళిద్దరూ చిత్రపటం దగ్గరకు చేరేసరికి అధ్యక్షుడు సమీపానికి వచ్చాడు. "ఇవేళ అంతా విచిత్రంగా జరిగింది. అద్భుతమైనరోజు" అన్నాడు తనూ వాళ్ళతోకలిసి ఆ ప్రశాంతమూర్తివంక తిలకిస్తూ.

"నాన్నా! నాకు యింతమంచి అక్కయ్యవుందని యిన్నాళ్ళూ చెప్పారుకారేం? నా బొమ్మను చూసుకుంటున్నట్లుగావుంది?"

"నేను దాచిపెట్టానా తల్లీ? అది కాలంచేసిన పని. ఇప్పుడూ కాలమే వెలికి తీసుకువచ్చింది."

"ఈ నాటినుంచీ మా యింటికి యిది ఓ అలంకారం." అన్నాడు అధ్యక్షుడు.

రాజయ్యగారి పెదవులపై ఓ మందహాసం కదిలింది. ఎవరూచూడకమునుపే ఎంతత్వరగా అవతరించిందో, అంత త్వరగా అంతర్హితమైంది.

కమలయింకా అక్కడే నిలబడి సవినయంగా, జాలిగ పరిశీలిస్తోంది ఆ సుందరమూర్తివంక. తండ్రి హస్తం భుజంమీద మెల్లగా పడేసరికి "పోదామంటూ రానాన్నా?" అంది బాధతో.

"నీకిష్టంలేకపోతే కొంచెంసేపు ఆగుదాం"

కమల ఆయనకేసి తిరిగి, తడిరెప్పలతో చూసి "పదండినాన్నా!" అంది.

సింహద్వారందాటి వెలుపలికివచ్చేసరికి చీకటి ముసక మసగ్గావుంది. శీతాకాలం వెళ్ళి వేసవి ప్రవేశిస్తున్నా యింకా చలిచలిగానే వుంటోంది. సభకు వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోవడం యింకా పరిసమాప్తి చెందలేదు. రాజయ్యగారు బయటకు రావటంచూసి డ్రైవరు కారుతీసుకువచ్చి ద్వారంముందు నిలిపాడు. కమల వెళ్ళి వెనక సీట్లోకూర్చుని తండ్రికోసం ఎదురు చూడసాగింది. ఆయనకూడా అధ్యక్షత వహించిన వ్యక్తి దగ్గర సెలవుతీసుకుని, మెట్లుదిగి, కారు దగ్గరకు రాబోతూండగా ప్రక్కనుంచి ఎవరో పిలిచారు.

ఆ పిలిచినవ్యక్తితో మాట్లాడడం పూర్తయేసరికి అయిదునిమిషాలు పట్టింది. మెల్లగా యివతలకు వస్తున్నాడు. జనంసందడి యింకా తగ్గలేదు. హఠాత్తుగా ఓవికటహాసం వికృతంగా వినిపించింది.

"బ్రదర్! సంస్కర్తగారి వచనంబులాలకించితివా?"

"ఊరుకోవోయి, వింటాడు ?

"పతితలంచే అనహ్యమట, తనకూతురు చేసిన పని ఏమిటో !"

"కూతురంటే? కమల విషయమేనా?" అంది చీకటిలో మూడోగొంతు.

"కాక యీవిడగారుమహా పతివ్రతా ఏమిటిగాని, ఆ నూతిలోపడి చచ్చిపోయిన కూతురు విషయం నేను చెబుతూంది - గ్రంధసాంగురాల్లే.

"ఛీ ఛీ. చచ్చి స్వర్గాన వున్నవారినిగురించి నింద చేస్తావుట్రా అప్రచ్యుడా! నీకిందేం పొయ్యేకాలం?"

"అవునులే మరగించిన వాళ్లంతా మహామహులనటం మనలో పరిపాటేగా. ఉత్తమ యిల్లాలు— మహాసాధ్వి. వాకిట్లోకి కాలు పెట్టి ఎరుగని విధవరాలు. అల్ల, ఆ శివాలయం వీధిన కొత్తగా మేడ కట్టాడే" ఆ నరశింహం పదేళ్ళక్రితం యువకుడేలే, యిదివరకు వీళ్లమేడప్రక్కన వుండేవాడు. పుణ్యం కట్టుకున్నాడు ?

"ఏమిటీ - నలుగురు బిడ్డలతండ్రి ?"

"ఇప్పుడూ !"

చీకటి నాలుగు కొంతుకలనవ్వుతోంది. రాజయ్యగారు శిలాప్రతిమవలె అలానే నిల్చుని వుండిపోయాడు. కారులోదీపం వెలుగుతోంది "నాన్న ! త్వరగా రావేం నాన్నా !" అనికమల పిలుస్తోంది తొంగి చూస్తూ.

ఒక అడుగువేశి, తూలి క్రింద బడపోయాడు. ప్రక్కనున్న గోడని ఆధారం చేసుకుని సంబాళించుకున్నాడు. మెల్లగా, అతిబరువుగా, కఠోరంగా. అడుగులు వేస్తూ కారులోకివచ్చి కూర్చున్నాడు వెలుగులో ఆయన ముఖంవంక తేరి బారిచూసి కమల భయవిహ్వాలురాలైంది. "అదేమిటినాన్నా ?" అని గొణిగింది కంపిత స్వరంతో.

ఆయనేమీ మాట్లాడలేదు. కనీసం తలత్రిప్పి అయినా చూడలేదు. అగ్నిలా జ్వలిస్తున్న నేత్రాలతో ఎవరూ అవలోకించలేని ఏదో అగాధాల్లోకి తీవ్రంగా చూస్తూ వుండిపోయాడు. ఆ విగ్రహాన్ని హఠాత్తుగా సందర్శించినపుడు ఎంతగా కఠినచిత్తుని గుండె అయినా సరే గడగడ వొణికితీరవలసిందే.

"నాన్నా !" అని పిలిచింది కమల భయంతో మళ్ళీ.

ఏమీ సమాధానం వెలువడలేదు. కమల యీసారి సంపూర్తిగా డోలాయమాన చిత్తంతో మూలను ఒదిగి భీతహారిణలా అణిగిఅణిగి ఆయన ముఖంలోకి చూసింది. మృదులమైన ఆ వదనం యినుములా రాటు తేలి క్రౌర్యాన్ని వెదజల్లుతోంది. ఆమె వణికిపోయింది. కిక్కురుమనకుండా కూర్చుంది.

కారు యింటి దగ్గరకువచ్చి ఆగాక కమల తొందరగాదిగి, తప్పటడుగులువేస్తూ పైకివెళ్ళిపోయింది. రాజయ్యగారు తీక్ష్ణంగాచూస్తూదిగి, తన గదిలోకి వెళ్లాడు. దీపం వెలిగించబడింది. చుట్టూరా కలయజూశాడు. ఒక్కసారిగా ఆవేదన, దుఃఖం పెల్లుబికినట్లయింది. రెండు చేతుల్లో తలదాచుకుని, బావురుమంటూ ... ...

"ఊహ" అనుకుని మనసుకు ఎదురు తిరిగాడు. ఇది కర్కశమైన ఆవేశం. అరవై ఏళ్ల వృద్ధునికి యవ్వన పురుష క్రోధాన్ని, కసినీకలిగిస్తూన్న ఆవేశం.

ఓ క్షణం గడిచింది. మనః క్షేత్రంలో ఒక ఉపన్యాసం జరుగుతోంది. పెద్దలంతా ఆసీనులై వున్నారు. అరవై ఏళ్లునిండిన వృద్ధుడు అంటున్నాడు. అలాంటి వాళ్ళంటే నాకు జాలి. నా ప్రేమకట్టలు తెగిన ప్రవాహమౌతుంది. అటువంటివాళ్ళని చూసినప్పుడు ... ...

"ఎటువంటివాళ్ళని చూసినప్పుడు ?" సభలోంచి ఎవరో కేకవేశారు.

"అటువంటివాళ్ళని ... అంటే ..." జవాబుకోసం తడుముకొంటున్నాడు.

(సశేషము)